సాక్షి
సిద్దిపేట
శనివారం । 21 । సెప్టెంబర్ । 2024



ఇన్‌చార్జీలు ఇంకెన్నాళ్లు?

ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి మెదక్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పడి 8 ఏళ్లవుతున్నా ప్రభుత్వ శాఖల్లో రెగ్యులర్ అధికారులు లేరు. వివరాలు 8లో ▸



బంగారం కోసమే హత్య

బంగారు నగల కోసం మహిళను హత్య చేసిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపారు. వివరాలు 8లో ▸



ఆర్థిక భారంతో..

గ్రామాల్లో చేపట్టిన పనులకు బిల్లు రాకపోవడంతో సొంత నిధులు వెచ్చిస్తూ ఆర్థిక భారంతో నలిగిపోతున్నామని పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

పాల బిల్లులను చెల్లించండి



టీజీడీడీసీఎఫ్ఎల్ చైర్మన్ అమిత్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న లక్ష్మారెడ్డి తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పాల బిల్లులు చెల్లించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మన్ అమిత్‌రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లో విజయ డెయిరీ చైర్మన్ లక్ష్మారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకుపోయినట్లు తెలిపారు. జూలై నుంచి సెప్టెంబర్ వరకు పాడి రైతులు విక్రయించిన పాల బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోరగా జూలై మొదటి 15 రోజుల బిల్లులను విడుదల చేశారన్నారు. అందుకు గాను టీజీడీడీసీఎఫ్ఎల్ చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపామన్నారు. జూలై రెండవ 15 రోజులు, ఆగస్టు మొదటి 15 రోజుల పాలబిల్లులు ఈ నెల చివరి వరకు నేరుగా రైతుల ఖాతల్లో జమ చేయనున్నట్లు అమిత్‌రెడ్డి తెలిపారన్నారు.

27న వేలంపాట

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డులోని కొన్ని దుకాణాలను అద్దెకు ఇచ్చేందుకు ఈనెల 27న వేలం పాట నిర్వహించనున్నట్లు సిద్దిపేట మార్కెట్ కమిటీ కార్యదర్శి వెంకటయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్కెట్ ముందు భాగంలో ఖాళీగా ఉన్న షాప్స్ 2, 6, 7, 8, 9, 10, 11, 12, 13, 14, 16 లను అద్దె ప్రాతిపదికన ఒక ఏడాదికి ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ.2 వేలు దరఖాస్తు పత్రాల కోసం మార్కెట్ కార్యదర్శి కార్యాలయంలో చెల్లించి పొందాలని సూచించారు. వేలం పాటలో పాల్గొనడానికి చెల్లించే రూ.2 వేలు తిరిగి వాపసు ఇవ్వబడదని పేర్కొన్నారు. 6 దుకాణాలు బీసీ వర్గాలకు, 3 జనరల్ కోటాలో, 2 ఎస్సీ సామాజిక వర్గాలకు కేటాయించామని పేర్కొన్నారు. ఈనెల 18 నుంచి 25 వరకు దరఖాస్తులను ఇవ్వాలని, ఈనెల 27న ఉదయం 11 గంటలకు ఆన్‌లైన్ వేలం పాట ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు మార్కెట్ కమిటీ అధికారులు సురేశ్ 94911–77684, సుధాకర్ 98668–84353 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థి అభినవ్ చక్రవర్తిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీకార్

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రానికి చెందిన తలారి అభినవ్ చక్రవర్తి రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 21 నుంచి 23 వరకు సిరిసిల్లలో నిర్వహిస్తున్న క్రీడల్లో పాల్గొననున్నాడు. తిమ్మాపూర్ మండలం అల్గునూర్ పారమిత వర్ల్డ్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఆ మేరకు ఎంపికైన విద్యార్థిని ప్రిన్సిపాల్ శ్రీకార్, పీడీ శ్రీనివాస్, శ్రీధర్ ఉపాధ్యాయులు అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ముస్త్యాల మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న నాలుగు ఉపాధ్యాయ పోస్టులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నరేందర్ రెడ్డి ప్రకటనలో తెలిపారు. టీజీటీ, పీజీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. టీజీటీకి డిగ్రీ, బీఈడీ చేసి టెట్ అర్హత సాధించిన వారు, పీజీటీకి పీజీ, బీఈడీ పూర్తి చేసిన వారు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 23 లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

మద్దూరులో..

మద్దూరు(హుస్నాబాద్): టీచర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శంకుతల ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ సివిక్స్, టీజీటీ ఇంగ్లిష్‌లలో ఖాళీ ఉన్నాయని పేర్కొన్నారు. ఈనెల 21 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌దేమో డైవర్షన్ పాలిటిక్స్

మాదేమో వాటర్ డైవర్షన్
- రైతుల పంటలు పండటం కాంగ్రెస్‌కు ఇష్టం లేదా?
- మాజీ మంత్రి హరీశ్‌రావు



మల్లన్నసాగర్‌ను ఎమ్మెల్యేలు ప్రభాకర్‌రెడ్డి,సునీత, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డితో కలిసి సందర్శిస్తున్న హరీశ్‌రావు

దుబ్బాక, తొగుట: మాదేమో వాటర్ డైవర్షన్.. కాంగ్రెస్‌దేమో డైవర్షన్ పాలిటిక్స్ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. 21 టీఎంసీలతో సముద్రంను తలపిస్తున్నా మల్లన్నసాగర్‌ను చూస్తుంటే కడుపునిండినంత సంతోషంగా ఉందని అన్నారు. శుక్రవారం తొగుట మండలంలోని మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లోకి రికార్డు స్థాయిలో 21 టీఎంసీల నీరు చేరడంతో ఎమ్మెల్యేలు ప్రభాకర్ రెడ్డి, సునీతారెడ్డి, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి, యాదవరెడ్డి, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన సందర్శించి గోదారమ్మకు పసుపు, కుంకుమ వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా నిండుకుండలా ఉన్న మల్లన్నసాగర్‌ను చూస్తూ హరీశ్‌రావుతో పాటు ఎమ్మెల్యేలు జై కేసీఆర్.. అపర భగీరథుడికి జేజేలు అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మల్లన్నసాగర్ లోకి మొదటిసారి 21 టీఎంసీల నీరు చేరిందన్నారు. సంతోషంతో చూసేందుకు వస్తే కాంగ్రెస్ నాయకులు అడ్డుకునేందుకు రావడం దుర్మార్గమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కొట్టుకు పోయిందని ఇక పనికిరాదని నీచరాజకీయాలు చేసిన కాంగ్రెస్‌కు మల్లన్నసాగర్ జలాలే సజీవ సాక్ష్యమన్నారు. రైతుల పంటలకు నీరు రావడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదా? అని ప్రశ్నించారు.

ఈ జిల్లాలు సస్యశ్యామలం

మల్లన్నసాగర్‌తో యాదాద్రి, సిద్దిపేట, మెదక్ జిల్లాలో యాసంగిలో సస్యశ్యామలం అవుతాయని ఆనందం వ్యక్తం చేశారు. మల్లన్నసాగర్ పూర్తి అయింది, కాలువలు 90 శాతం పూర్తి అయ్యాయని, మిగతా 10 శాతం పనులు కూడా పూర్తి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌కు మంచినీళ్లు తీసుకుపోతా మూసీకి నీళ్లు తీసుకుపోతా అంటూ మాట్లాడుతున్నారన్నారు. దీనికి కేసీఆర్ కట్టిన కాళేశ్వరం, మల్లన్నసాగర్‌లే దిక్కు అయ్యాయి కదా అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.93 వేల కోట్లయితే ఎన్నికల ముందు లక్ష కోట్ల అవినీతి జరిగిందని కాంగ్రెస్ చిల్లరగా మాటలు మాట్లాడిందన్నారు. కేసీఆర్ పుణ్యమా అని అన్ని చెరువులు మంచిగా ఉన్నాయి నదులను ప్రాజెక్టులతో అనుసంధానం చేశారన్నారు.

వినాయక విగ్రహాల వద్ద పూజలు

పట్టణంలో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కత్తి కార్తీక ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణేశుడితో పాటు పట్టణంలోని పలు సంఘాల గణేశుల వద్ద పూజలు చేశారు. దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత భూంరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీక తదితరులున్నారు.

మల్లన్నసాగర్ కట్ట వద్ద ఉద్రిక్తత

- మాజీ మంత్రి హరీశ్‌రావుకు వ్యతిరేకంగా నినాదాలు
- ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్
- గత బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని మండిపాటు
- భారీగా పోలీసుల మోహరింపు



మల్లన్న సాగర్ కట్ట వద్ద ఆందోళన చేస్తున్న తుక్కాపూర్ గ్రామస్తులు

తొగుట(దుబ్బాక): కొమురవెల్లి మల్లన్న సాగర్ కట్టపై శుక్రవారం తీవ్ర ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మల్లన్న సాగర్‌ను పరిశీలించేందుకు మధ్యాహ్నం వస్తారనే సమాచారంతో తుక్కాపూర్ మాజీ సర్పంచ్ చెరుకు విజయ్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున కట్టపైకి చేరుకున్నారు. మాజీ మంతికి వ్యతిరేకంగా నినాదాలు రాసిన ఫ్లెక్సీలు, ప్లకార్డులను ప్రదర్శించారు. కేసీఆర్, హరీశ్‌రావుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సిద్దిపేట ఏసీపీ పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రిజర్వాయర్ నిర్మాణం కోసం భూములు అందజేస్తే తమను హరీశ్‌రావు నిలువునా ముంచారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతీ కుటుంబానికి 250 గజాల ఇంటి స్థలంతో పాటు డబుల్ బెడ్‌రూంలు మంజూరు చేస్తామని హామీనిచ్చారని గుర్తుచేశారు. రిజర్వాయర్‌కు భూమిలిచ్చిన వారిని కడుపులో పెట్టుకుని చూస్తామని దొంగమాటలు మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముంపు గ్రామంగా ప్రకటించి అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీనిచ్చారని గుర్తుచేశారు. కట్ట నిర్మాణం తర్వాత తమను విస్మరించారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో నీళ్ల నింపడంతో ఇళ్లలోకి నీరు చేరి ఉండలేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ క్రమంలో తొగుట సీఐ లతీఫ్ గ్రామస్తులకు నచ్చజెప్పి అక్కడి నుంచి తరలించారు. పోలీసులు సమయస్ఫూర్తితో వ్యవహరించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

పిల్లల ఆరోగ్యానికి పెద్దపీట

కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి



న్యూట్రిషన్ చాంపియన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేటరూరల్: జిల్లావ్యాప్తంగా 5 సంవత్సరాలలోపు వయసు ఉన్న చిన్నారుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో జిల్లా వైద్య, సంక్షేమ శాఖ విభాగాలు ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా సంక్షేమ శాఖ సమన్వయంతో జిల్లాలోని వైద్యాధికారులు, సీడీపీఓలు, వైద్యశాఖ సూపర్‌వైజర్స్, సంక్షేమ శాఖ సూపర్‌వైజర్స్‌లతో కలిసి ఆయన అనుబంధ పోషకాహారంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వైద్యశాఖ, మాతాశిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో ప్రతీ పిల్లవాడి ఆరోగ్యాన్ని సమీక్షిస్తూ మెరుగుపరిచేందుకు కృషి చేయాలన్నారు. వైద్యులు రెఫర్ చేసిన పిల్లల్ని అంగన్‌వాడీ ఆశా కార్యకర్తల సమన్వయంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో న్యూట్రిషన్ సెంటర్‌లో అడ్మిట్ చేసి చికిత్స అందేటట్లు చూడాలన్నారు. డిశ్చార్జి తర్వాత కూడా 8 వారాల వరకు వారిని పర్యవేక్షణ చేయాలన్నారు. అనంతరం ఎన్‌హెచ్‌టీఎస్ పోర్టల్‌లో అప్డేట్ చేయాలని ఆదేశించారు. అంతకుముందు రాష్ట్ర ట్రైనింగ్ ఆఫీసర్ నరసింహారావు జూమ్ మీటింగ్ ద్వారా ఎస్ఏఎమ్, ఎంఏఎమ్, ఎమ్‌యూడబ్ల్యూ, ఎస్‌యూడబ్ల్యూ పిల్లల ఆరోగ్యం మెరుగుపరచడమే లక్ష్యంగా కార్యక్రమం చేపట్టామన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతపై కూడా గర్భిణులకు, తల్లులకు, కుటుంబాలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం న్యూట్రిషన్ చాంపియన్ పోస్టర్లతో పాటుగా, టెలీ మానస్ టోల్ ఫ్రీ నంబర్ బోర్డులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ ఎంహెచ్ఎన్ డాక్టర్ ఆనంద్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి శారద, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ నారాయణ, డిప్యూటీ డీఎంహెచ్ఓ రేవతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ రజిని, ఐసీడీఎస్ వైద్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలు ముఖ్యమే



జ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభిస్తున్న బక్కి వెంకటయ్య

ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రతీ విద్యార్థి చదువుతో పాటు క్రీడారంగంలో రాణించాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కోరారు. మాజీ సర్పంచ్ బక్కి భాగ్యలక్ష్మి సహకారంతో అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల స్థాయి క్రీడా పోటీలను డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, సిద్దిపేట ఆర్డీఓ సదానందంతో కలిసి ఆయన క్రీడాజ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. క్రమశిక్షణ కలిగి విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడితే కుంగిపోకుండా గెలిస్తే పొంగిపోకుండా ప్రతీఒక్కరు తమ క్రీడా నైపుణ్యాలకు పదును పెట్టాలని సూచించారు. వీరిలో దాగి ఉన్న క్రీడానైపుణ్యాలను వెలికి తీయడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తగిన ప్రోత్సాహం అందించాలని కోరారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శరీర దృఢత్వానికి దోహదం చేస్తాయన్నారు. గ్రామీణ, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించి మంచి పేరు తీసుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ జోగు ప్రభుదాస్, మాజీ వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, భూంపల్లి మాజీ సర్పంచ్ బక్కి భాగ్యలక్ష్మి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ వల్లాల సత్యనారాయణ, నాయకులు, సూకూరి లింగం, అబ్బుల బాలాగౌడ్, దుబ్బరాజం, కనకయ్య, పీఈటీలు తోట వెంకట్‌రెడ్డి, వెల్ముల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో జిల్లాను రాష్ట్రస్థాయిలో నిలపాలి

డీఐఈఓ రవీందర్‌రెడ్డి



డీఐఈఓ రవీందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, లెక్చరర్లు

దుబ్బాక: ఇంటర్మీడియెట్ విద్యాపరంగా సిద్దిపేట జిల్లాను రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిపేందుకు అందరూ కృషి చేయాలని సిద్దిపేట జిల్లా ఇంటర్ విద్యాధికారి (డీఐఈఓ) రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన డీఐఈఓగా బాధ్యతలు స్వీకరించాక మొదటిసారిగా దుబ్బాక ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, లెక్చరర్లు, నాన్‌టీచింగ్ స్టాఫ్‌తో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. దుబ్బాకలో అధునాతనమైన భవనం, ఫర్నిచర్ విద్యార్థులకు అందుబాటులో ఉండటం సంతోషకరమన్నారు. కళాశాలలో జనరల్ 4 గ్రూపులు, ఒకేషనల్ విభాగంలో నాలుగు గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన పరీక్షల్లో దుబ్బాక కళాశాల ఒకేషనల్ కోర్సు విద్యార్థి రాష్ట్రస్థాయిలో టాపర్‌గా నిలవడం సంతోషకరమన్నారు. ఇదే స్ఫూర్తితో కళాశాలలో అన్ని గ్రూపులకు అడ్మిషన్ల సంఖ్యను మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతీ సంవత్సరం ఫలితాల శాతం మరింతగా పెంచేందుకు లెక్చరర్లు, ప్రిన్సిపాల్ ప్రత్యేకశ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెంచడంతో పాటు గైర్హాజరయ్యే విద్యార్థుల తల్లిదండ్రులకు సమచారం చేరవేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయనను ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, లెక్చరర్లు సన్మానించారు.

చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో విధులు నిర్వహించే మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ గోల్కొండ నర్సయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ చాలీచాలనీ వేతనాలతో కార్మికులు దుర్భర జీవితాలను గడుపుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి కార్మికులకు రూ. 26వేల వేతనం ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం రూ. 25లక్షలు కల్పించాలని, మహిళలకు పని ప్రదేశాల్లో భద్రత కల్పించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇంకా కార్యక్రమంలో కార్మికులు కుమార్, సంతోశ్, వెంకటేశ్, యాదగిరి, నర్సింహులు, లక్ష్మీ, యాదమ్మ, సైదమ్మ పాల్గొన్నారు.

మహిళలు ఐక్యంగా ఉద్యమించాలి

ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశాలత



మాట్లాడుతున్న ఆశాలత

దుబ్బాకటౌన్: ప్రతీ మహిళ పురుషులకు బానిసలుగా, వంటింటికే పరిమితం కావాలని ప్రస్తుత పాలకవర్గాలు కోరుకుంటున్నాయని అలాంటి వారిపై అన్ని వర్గాల మహిళలు ఐక్యంగా ఉద్యమించాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.ఎస్.ఆశాలత పిలుపునిచ్చారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం దుబ్బాక మండల ద్వితీయ మహాసభను శుక్రవారం పట్టణంలో నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరై ఆమె మాట్లాడారు. దేశంలో మహిళలపై రోజురోజుకు దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని దీనికి కేంద్ర ప్రభుత్వ విధానాలే ప్రధాన కారణమని విమర్శించారు. 72 నిమిషాలకు ఒక అత్యాచారం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న అనేక రకాల దాడులకు వ్యతిరేకంగా పోరాడుతుంది ఐద్వా మాత్రమేనని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బేటీ బచావో, బేటీ పఢావో పిలుపు కేవలం నినాదానికే పరిమితమైందని విమర్శించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సింగిరెడ్డి నవీన, మహిళా నాయకురాలు బాల్‌లక్ష్మి, మానస, స్రవంతి, రేఖ, రేణుక, సుజాత, మౌనిక, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి అరుదైన శస్త్ర చికిత్స



శస్త్రచికిత్స అనంతరం రోగితో మాట్లాడుతున్న వైద్యులు

సిద్దిపేటకమాన్: వినికిడి సమస్యతో బాధపడుతున్న యువకుడికి శస్త్ర చికిత్స ద్వారా వినికిడి వచ్చేలా చేశారు సిద్దిపేట ప్రభుత్వ వైద్యులు. సూపరింటెండెంట్ డాక్టర్ సురేశ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. కోల్‌కత్తాకు చెందిన యువకుడు అముజత్ కొద్ది నెలల క్రితం కూలీ పనుల నిమిత్తం మెదక్‌కు వలసొచ్చాడు. నాలుగు సంవత్సరాల నుంచి వినికిడి సమస్యతో బాధపడుతున్నాడు. కుడి వైపు చెవి పూర్తిగా వినిపించదు. ఐదు రోజుల క్రితం చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి వచ్చాడు. పరీక్షించిన ఈఎన్‌టీ విభాగ వైద్యులు అతడిని ఎండోస్కోపీ స్కానింగ్ ద్వారా ఓటోస్క్లిరోసిస్ అనే వ్యాధి ఉన్నట్లు గుర్తించారు. దీంతో అతడికి శుక్రవారం ఈఎన్‌టీ విభాగ హెచ్ఓడీ డాక్టర్ నాగరాజు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అమీద్, డాక్టర్ రాహుల్, అనస్థీషియా డాక్టర్ చందర్, డాక్టర్ అనుపమ అముజద్‌కు అరుదైన స్టెపిడోటమీ శస్త్రచికిత్స నిర్వహించినట్లు తెలిపారు. ఇదే శస్త్ర చికిత్స హైదరాబాద్‌లో ఉన్న కార్పొరేట్ ఆస్పత్రుల్లో రూ.2లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. సిద్దిపేటలో మొదటిసారిగా ఇటువంటి శస్త్ర చికిత్సను నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి బావుందన్నారు. వినికిడి నార్మల్‌గా ఉన్నట్లు వైద్యులు నిర్ధారించినట్లు తెలిపారు. ఆపరేషన్ నిర్వహించిన వైద్య బృందాన్ని మెడికల్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విమలాథామస్ అభినందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే రాష్ట్రాభివృద్ధి

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూజల గోపికృష్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోనే అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పూజల గోపికృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, తదితర రంగాలన్నింటికీ న్యాయం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలోని యువతకు స్కిల్ యూనివర్సిటీ ద్వారా నైపుణ్యం పెంచి ఉపాధి కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. విద్యారంగంలో నాణ్యతా ప్రమాణాల పెంపునకు కూడా కోసం కృషి జరుగుతోందన్నారు. పది సంవత్సరాలు బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని విమర్శించారు. 10 నెలలుగా రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు వెళ్తోందన్నారు. ప్రభుత్వ పథకాలు పేదల దరి చేరుతున్నాయని అన్నారు. త్వరలోనే కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తు ప్రక్రియ మొదలుకానుందన్నారు. రాష్ట్ర మైనారిటీ కన్వీనర్ కలిమొద్దీన్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు వాహబ్, పట్టణ మైనార్టీ అధ్యక్షుడు సలీమ్, మైపాల్ రెడ్డి, సాంబమూర్తి, ఎర్ర మహేందర్, జనార్దన్ రెడ్డి, చెంది శ్రీనివాస్, పట్టణ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు ప్రతాప్, అసెంబ్లీ ఉపాధ్యక్షుడు అజ్మత్, రాజు, నవీన్‌పాల్గొన్నారు.

ప్రభుత్వాల వ్యతిరేక విధానాలపై పోరాడుదాం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని
- గజ్వేల్‌లో బైక్ భారీ ర్యాలీ

గజ్వేల్‌రూరల్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అమరులైన వారిని స్మరించుకుంటూ వారి పోరాట స్ఫూర్తితో యువ కమ్యూనిస్టులు పాలక ప్రభుత్వాల వ్యతిరేక విధానాలపై పోరాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 76వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అధ్యక్షతన గజ్వేల్ భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని కోలా అభిరాం గార్డెన్‌లో సమావేశం నిర్వహించగా సాంబశివరావు హాజరై మాట్లాడారు. పోరాటాలు, త్యాగాల చరిత్ర కమ్యూనిస్టులదని, భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాటం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని గుర్తుచేశారు. దీన్ని బీజేపీ హిందు–ముస్లింల మధ్య జరిగిన గొడవగా వక్రీకరిస్తుందని ఆరోపించారు. 4,500 మంది కమ్యూనిస్టు అమరులు కాగా ఎట్టకేలకు నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణకు విముక్తి కలిగిందని పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత హైదరాబాద్‌ను నిజాం నవాబులు తమ ఆధీనంలో పెట్టుకొని ప్రత్యేక దేశంగా పాలన సాగిస్తూ తెలంగాణ ప్రజల నుంచి దొరలు, దేశ్‌ముఖ్‌లు, జమీందార్‌లు, జాగిర్దార్‌లను రజాకార్లతో పన్నుల రూపంలో చిత్రహింసలకు గురిచేస్తున్న రోజుల్లో బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, మక్దూమ్, అనభేరి ప్రభాకర్ తదితరులు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారని తెలిపారు. దున్నేవాడికే భూమి ఇవ్వాలని, 10 లక్షల ఎకరాల భూమిని పంచిన ఘనత సీపీఐదేనని పేర్కొన్నారు. పార్టీ నాయకులు ప్రకాశ్‌రావు, దయానందరెడ్డి, కృష్ణ, వినేశ్, లక్ష్మణ్, అశోక్, రాజేశం, శ్రీను, నర్సింహారెడ్డి, మల్లారెడ్డి, మున్వర్‌జాన్, పద్మ, రజిని, మమత, కొమురయ్య, రూపేశ్, సుధాకర్, ఏఐఎస్ఎఫ్ నాయకులు జనార్దన్, మధు, నరేశ్, ప్రసన్నకుమార్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్‌లో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నేతలు, కార్యకర్తలు

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీల్లో రెండు పతకాలు


పతకాలు సాధించిన క్రీడాకారులు

సిద్దిపేటజోన్: ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాద్‌లో జరుగుతున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు ఒక వెండి, కాంస్య పతకం లభించాయి. రాఘవపూర్‌కు చెందిన లీలా ఆనంద్ వెండి పతకం, కొండపాకకు చెందిన నగేశ్ కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా వీరిని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకట్ స్వామి అభినందించారు.

కుమారుడితో సహా తల్లి అదృశ్యం


లక్ష్మీ, ప్రణయ్

పటాన్‌చెరు టౌన్: తల్లి, కుమారుడు అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ వడ్డెర కాలనీకి చెందిన సాయికుమార్(20) ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 18న సాయికుమార్ భార్య లక్ష్మీ, కుమారుడు ప్రణయ్ (11 నెలలు)తో కలిసి అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చారు. అదే రోజు మధ్యాహ్నం నుంచి ఇద్దరూ కనిపించకుండా పోయారు. చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. సాయి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు.

కమీషన్ పేరుతో రూ.5.45 లక్షలు మోసం

పటాన్‌చెరుటౌన్: టాస్కులు, కమీషన్ పేరుతో జరిగిన సైబర్ మోసంలో ఓ వ్యాపారి భారీ ఎత్తున నగదు పోగొట్టుకున్న ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యాపారికి టాస్కులు, కమీషన్ పేరుతో 5వ తేదీన మెసేజ్ వచ్చింది. ఆ వ్యాపారి తన వివరాలను నమోదు చేశాడు. సైట్ నిర్వాహకులు అతనికి ఓ వ్యాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. టాస్కులు పూర్తి చేస్తే పెట్టిన నగదుతోపాటు కమీషన్ వస్తుందని నమ్మించడంతో ఉద్యోగి పలు దఫాలుగా రూ.5 లక్షల 45 వేలు వేశాడు. చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం శుక్రవారం పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

బహిష్కరణ కేసులో 13 మంది అరెస్ట్


అరెస్ట్ చేసిన వారిని చూపుతున్న డీఎస్పీ

మనోహరాబాద్(తూప్రాన్): వారం రోజుల కిందట సాంఘీక బహిష్కరణ విషయంలో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులో 13 మందిని అరెస్ట్ చేసినట్లు మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్‌గౌడ్ శుక్రవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో భాగంగా గురు వారం ముగ్గురు, శుక్రవారం 13 మందిని డీఎస్పీ వెంకటరెడ్డి అరెస్ట్ చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వీరిలో ఎర్ర కృష్ణ, బోడ్డు ఆంజనేయులు, పర్వబోయిన నాగరాజు, చిన్నబాల సాయిలు, మాసుల కృష్ణ, చాపల స్వతనారాయణ, కుమ్మరి నాగభూషణం, గోత్రాల స్వామి, రాజబోయిన సాయి లు, నాచారం స్వామి, కుక్కల వెంకటేష్, కర్రె కృష్ణ, చిన్నబాల కనకమ్మలను ఉన్నట్లు తెలిపారు.

ఇన్‌చార్జీలు ఇంకెన్నాళ్లు?

- ప్రభుత్వ కార్యాలయాల్లో కనిపించని రెగ్యులర్ అధికారులు
- జిల్లా ఏర్పడి ఎనిమిదేళ్లయినా తాత్కాలిక పాలనే
- ఒక్కో అధికారికి రెండు నుంచి మూడు శాఖలు
- అదనపు బాధ్యతలతో కుంటుపడిన అభివృద్ధి
- ప్రజలకు సకాలంలో అందని సేవలు


మెదక్ జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయం

మెదక్ కలెక్టరేట్: ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి మెదక్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పడి ఎనిమిదేళ్లవుతున్నా ఇప్పటికీ ప్రభుత్వ శాఖల్లో రెగ్యులర్ అధికారులు లేరు. గత ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం 2016లో జిల్లాను విభజించగా మెదక్ 15 మండలాలతో ప్రత్యేక జిల్లాగా ఏర్పడింది. అనంతరం 15 మండలాలను విభజించి 6 కొత్త మండలాలను ఏర్పాటు చేశారు. దీంతో జిల్లాలో మొత్తం 21మండలాలు అయ్యాయి. కానీ ఇందుకనుగుణంగా జిల్లాలో పలు శాఖలకు రెగ్యులర్ అధికారులను నియమించలేదు. దీంతో నేటికీ జిల్లాలో ఇన్‌చార్జీల పాలనే కొనసాగుతుంది.

మెదక్ జిల్లా కొత్తగా ఏర్పడటంతో సమయానికి సేవలు అందుతాయని ప్రజలు భావించారు. సంగారెడ్డికి వెళ్లాల్సిన బాధ తప్పుతుందనుకున్నారు. కానీ జిల్లా ఏర్పాటుతోపాటు రెగ్యులర్ అధికారులను ఇవ్వకపోడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఉన్న అధికారులకు కూడా రెండు నుంచి మూడు శాఖల బాధ్యతలు అప్పగించడంతో అన్ని శాఖలకు న్యాయం చేయలేకపోతున్నారు. అధికారుల కోసం కార్యాలయాలకు వచ్చిన ప్రజలకు సమయానికి సేవలు అందడం లేదు. ముఖ్యంగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, ఎంప్లాయిమెంట్ శాఖ, గ్రౌండ్ వాటర్ ఆఫీసర్, లేబర్ ఆఫీసర్, లీగల్ మెట్రాలజీ, ఎక్సైజ్‌శాఖ వంటి శాఖలకు జిల్లాలో రెగ్యులర్ పోస్టులే లేవు. ఇంకా ఇన్‌చార్జిల పాలనే కొనసాగుతుంది.

ఫుడ్ సేఫ్టీలో కొరవడిన పర్యవేక్షణ

ప్రస్తుతం హైదరాబాద్ ఫుడ్ సేఫ్టీశాఖలోని అధికారిణి శ్రీశిఖకు మెదక్ ఫుడ్ సేఫ్టీ అధికారిగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్‌కు రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో జిల్లాలో హోటళ్ల నాణ్యత పాటించడం లేదు. మరోవైపు కల్తీ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వీటిపై పర్యవేక్షణ పూర్తిగా కరువైంది. దీంతో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లు, చాట్ బండార్, స్వీట్ షాప్‌లు విచ్చలవిడిగా ఏర్పడుతున్నాయి. ఇటీవల మెదక్ జిల్లా కేంద్రంలోని నాలుగు హోటళ్లలో 70 కిలోల మాంసం నిల్వలు లభించడం, తూప్రాన్, నర్సాపూర్‌లలో ఇటీవల జరిగిన ఘటనలు నిదర్శనంగా చెప్పవచ్చు.

ఎంప్లాయిమెంట్ కరువు

జిల్లా ఎంప్లాయిమెంట్ శాఖ అధికారిగా సంగారెడ్డికి చెందిన రామరాజు ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. రెండు జిల్లాలో విధులు ఉండటంతో మెదక్‌లో ప్రత్యేకంగా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టడం లేదు. దీంతో నిరుద్యోగులకు ఎంప్లాయిమెంట్ గురించి అవగాహన కరువైంది. ఫలితంగా నిరుద్యోగ యువతీ, యువకులు హైదరాబాద్‌కు వలస వెళ్లి చిన్న చిన్న పనులు చేసుకుంటున్నారు. లేదంటే లేబర్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం జిల్లా భూగర్భశాఖ అధికారిగా సంగారెడ్డికి చెందిన వెంకటేశ్వర్లు ఇన్‌చార్జి కొనసాగుతున్నారు. జిల్లాలో వ్యవసాయం కోసం రైతులు, ఇళ్ల నిర్మాణాలకు ప్రజలు బోర్లు తవ్విస్తున్నారు. అడ్డగోలుగా బోర్ల తవ్వకాలు జరుగుతున్నాయి. ఎవరూ నిబంధనలు పాటించడం లేదు. లీగల్ మెట్రాలజీ అధికారిగా సంగారెడ్డికి జిల్లాకు చెందిన సుధాకర్ యాదవ్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. కేవలం ఏడుపాయల జాతర సమయంలోనే శాఖ అధికారులు కనిపిస్తారు. మిగితా సమయంలో జిల్లాలో ఎక్కడ అధికారి పని తీరు కనిపించడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. జిల్లా కార్మికశాఖ అధికారిగా రామాయంపేట అధికారి రాజు ఇన్‌చార్జి కొనసాగుతున్నారు. దీంతో సంక్షేమ పథకాలు అందడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యమైన అధికారులంతా ఇన్‌చార్జీలే..

జిల్లాలోని వివిధ శాఖలకు సంబంధించి సుమారు 15 మందికి పైగానే ఇన్‌చార్జీలు ఉన్నారు. వీరందరికీ అదనపు బాధ్యతలు అప్పగించకపోవడంతో సమయానికి పనులు చేయలేకపోతున్నారు. జిల్లా లోకల్‌బాడీ అదనపు కలెక్టర్‌గా వెంకటేశ్వర్లు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారిగా మూర్తి, జిల్లా ఇంటర్ నోడల్ ఆఫీసర్‌గా మాధవి, జిల్లా ఆస్పత్రుల సూపరింటెండెంట్‌గా శివదయాల్, జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారిగా శ్రీనివాస్‌రెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారిగా నాగరాజుగౌడ్, పశు సంవర్ధశాఖ అధికారిగా వెంకటయ్య, విజయ డెయిరీ డీడీగా గోపాల్‌సింగ్, జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ శాఖ అధికారిగా బ్రమ్మాజీ, మార్కెటింగ్ ఏడీగా యాదయ్య, వయోవృద్ధుల విద్యాశాఖ అధికారిగా అనిల్ కుమార్, మార్క్‌ఫెడ్ అధికారిగా క్రాంతి, చేనేత కార్మికశాఖ అధికారిగా శ్రీకాంత్‌రెడ్డి, సోలార్ డీఎంగా మాణిక్, ఆరోగ్యశ్రీ శాఖ అధికారిగా నరేశ్ ఇన్‌చార్జి అధికారులుగా కొనసాగుతున్నారు.

స్కీములు ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దు

- ప్రభుత్వమే బోర్డు ద్వారా కార్మికులకు పథకాలను అమలు చేయాలి
- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు


కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్ : భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలు చేస్తున్న స్కీములను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దని, బోర్డు అడ్వాన్సరీ కమిటీని నియమించి ప్రభుత్వమే బోర్డు ద్వారా సంక్షేమ పథకాలను కార్మికులకు అందించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు కోరారు. ఈ మేరకు బీసీడబ్ల్యూఎఫ్, సీఐటీయూ అనుబంధ యూనియన్ ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ.. తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద, సహజ మరణాలు, శాశ్వత, పాక్షిక అంగవైకల్యం ఈ నాలుగు సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు టెండర్ల ద్వారా అప్పగించి ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పించుకోవాలని చూస్తుందన్నారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. లేకపోతే భవన నిర్మాణ కార్మికులను ఏకం చేసి ప్రభుత్వ మీద తిరుగుబాటు చేస్తామని హెచ్చరించారు. అలాగే 23న లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట వేలాదిమంది కార్మికులతో ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెంటయ్య, జిల్లా నాయకులు దత్తు, బాబురావు, సుదర్శన్ పాల్గొన్నారు.

జీవో 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలి

రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడమే కాకుండా వారికి జీఓ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని సాయిలు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆరోగ్య శ్రీ ఉద్యోగులు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ.. 17 ఏళ్లుగా ఆరోగ్యశ్రీ ఉద్యోగులకు కనీస వేతనాలు, రెగ్యులరైజేషన్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వారిని పర్మినెంట్ చేయడంతో పాటు జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, అశోక్, ఉద్యోగులు గాయత్రీ, చంద్రకళ, వినోద్, నాగరాజు, సత్యనారాయణ, రమేశ్, నర్సింలు, రవీందర్, శ్యామ్, క్రైరిస్ తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో మహిళా కూలీ మృతి

- గతంలో తండ్రి ఇప్పుడు తల్లి
- అనాథలైన ఇద్దరు కూతుళ్లు


భూలక్ష్మి (ఫైల్)

దుబ్బాకరూరల్: పాము కాటుకు గురై మహిళ మృతి చెందారు. ఈ ఘటన మండలంలోని అప్పనపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ గంగరాజ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన గ్యార భూలక్ష్మి (48) చర్లపల్లి రాజిరెడ్డికి చెందిన మొక్కజొన్న చేనులో కంకులు తెంపడానికి కూలీ పనికి వెళ్లింది. కంకులు తెంపుతున్న క్రమంలో పాము కాటు వేసింది. ఒక్కసారిగా ఆమె కేకలు వేయడంతో తోటి కూలీలు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి రప్పించారు. పరీక్షించిన అంబులెన్స్ సిబ్బంది అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి అత్తమ్మ గంగవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నాడు తండ్రి.. నేడు తల్లి

భూ లక్ష్మి భర్త ఆశయ్య కొన్నేళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి ఇద్దరు కూతుళ్లను కూలీ పనులు చేసుకుంటూ పోషిస్తుంది. తల్లిదండ్రులు మృతి చెందడటంతో అక్కాచెల్లెళ్లు అనాథలుగా మారారు. ప్రస్తుతం వీరిద్దరు ఇంటర్మీడియట్ చదువుతున్నారు.

విద్యుదాఘాతంతో పంచాయతీ కార్మికుడు

వట్‌పల్లి(అందోల్): విద్యుదాఘాతంతో పంచాయతీ కార్మికుడు మృతి చెందిన ఘటన అందోలు మండలం తాలెల్మ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ పాండు కథనం మేరకు గ్రామానికి చెందిన లక్ష్మయ్య (45) పంచాయతీలో రెండు నెలల కిందట మల్టీపర్పస్ ఉద్యోగిగా చేరాడు. గ్రామంలో వీధి దీపాలు వెలగకపోవడంతో ఉదయం గ్రామ కార్యదర్శి, లైన్‌మెన్‌లు ఎల్‌సీ తీసుకొని దగ్గరుండి లైట్లు పెట్టించారు. తిరిగి సాయంత్రం వేళలో ఎల్‌సీ తీసుకోకుండా మిగిలిన లైట్లు ఏర్పాటు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మృతురాలి భార్య ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పాండు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు..


కేశయ్య మృతదేహం

పాపన్న పేట (మెదక్): చేపలు వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మిన్పూర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన నాయికోటి కేశయ్య(53) మత్స్యకారుడిగా జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం చేపలు పట్టడానికి చెరువు వద్దకు వెళ్లాడు. చేపలు పట్టేందుకు వల వేయగా ఆ వల అతడికే తట్టుకొని నీట మునిగాడు. అక్కడే ఉన్న స్థానికులు గమనించి గ్రామస్తులు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని స్థానికుల సాయంతో చెరువులో గాలించి మృతదేహానినబయటకు తీశారు. మృతుడికి భార్య ఆశవ్వతోపాటు కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

రెండు బైక్‌లు ఢీ

- ఒకరు మృతి, ఐదుగురికి గాయాలు
- నాందేడ్ జాతీయ రహదారిపై ఘటన


వట్‌పల్లి(అందోల్) : ఘటనా స్థలంలో క్షతగాత్రులు

వట్‌పల్లి(అందోల్): రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, ఐదుగురికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన శుక్రవారం అందోలు మండలం డాకూరు జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఏఎస్ఐ గౌస్ కథనం మేరకు.. సదాశివపేట మండలం పెద్దాపురం గ్రామానికి చెందిన చంద్రయ్య(60), భార్య మణెమ్మతో కలిసి టీవీఎస్ ఎక్సెల్ పై అందోలు మండలం బ్రహ్మణపల్లి గ్రామానికి బంధువుల ఇంటికొస్తున్నారు. సంగుపేట వద్ద సర్వీసు రోడ్డు గుండా వెళ్లాల్సి ఉండగా బ్రిడ్జి ఎక్కి కొంత దూరం ప్రయాణించి రాంగ్‌రూట్‌లో వెళ్తున్నామని రోడ్డు పక్కన వాహనం ఆపాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి నారాయణఖేడ్ వైపు వస్తున్న మరో బైక్ వీరిన ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చంద్రయ్యకు తీవ్ర గాయాలు కాగా, మణెమ్మతోపాటు మరో బైక్‌పై ఉన్న విజయ్, అతడి భార్య నవ్య, చిన్నారులు శిరీష, ఆర్యన్‌కు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను జోగిపేట ప్రభుత్వ తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం సంగారెడ్డికి తరలించగా చికిత్స పొందుతూ చంద్రయ్య మృతి చెందాడు.

కారు ఢీకొని మహిళ..


దుర్గమ్మ (ఫైల్)

కొల్చారం(నర్సాపూర్):కారు ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన పోతంశెట్టిపల్లి చౌరస్తా మెదక్ నర్సాపూర్ జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పోతంశెట్టిపల్లి వడ్డెర కాలనీకి చెందిన ముద్దంగుల మల్లయ్య భార్య దుర్గమ్మ (56) మెదక్ పట్టణంలో పని ఉండడంతో వెళ్లి తిరిగి బస్సులో స్వగ్రామానికి ప్రయాణమైంది. పోతంశెట్టిపల్లి చౌరస్తా గేటు వద్దకు రాగానే బస్సు దిగి నడుచుకుంటూ వెళ్తుంది. ఈ క్రమంలో మెదక్ వైపు నుంచి వేగంగా వచ్చిన కారు ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీ క్లీనర్ పనికి వచ్చి విగతజీవిగా మారి

మనోహరాబాద్(తూప్రాన్):అనుమానాస్పద స్థితిలో లారీ క్లీనర్ మృతి చెందిన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శుక్రవారం మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు.. విజయనగరం జిల్లా రాజాం మండలం ఐలపేట గ్రామానికి చెందిన రాంబాబు (43) లారీపై క్లీనర్‌గా పని చేస్తున్నాడు. గురువారం స్క్రాప్ తీసుకొని మనోహరాబాద్ మండలం రంగాయపల్లి శివారులో గల ఎంఎస్ అగర్వాల్‌కు వచ్చారు. ఆరుబయట పడుకొని ఉన్న రాంబాబు శుక్రవారం మృతి చెంది కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. రాంబాబు గుండెపోటుతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, కుటుంబీకులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రామచంద్రాపురం పట్టణంలోని కాకతీయనగర్ కాలనీలో గల శ్రీసాయి రెసిడెన్సీలో వాచ్‌మెన్‌గా పనిచేసే గంగారం(38) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. శుక్రవారం తెల్లావారుజామున వాంతులు చేసుకున్నాడు. గమనించిన భార్య వెంటనే చుట్టుపక్కల వారి సాయంతో పటాన్‌చెరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులకు తాను ఆరు ప్యాకెట్ల ఎలుక మందును తాగినట్లు గంగారం పేర్కొన్నాడు. మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నాలుగు గంటల్లోపే వేటు

- చర్చనీయాంశమైన తహసీల్దార్ సస్పెన్షన్
- కలెక్టర్‌పై ప్రశంసలు

రేగోడ్(మెదక్): రేగోడ్ తహసీల్దార్ బాలలక్ష్మి గురువారం సస్పెన్షన్ అయిన విషయం తెలిసిందే. తహసీల్దార్ సస్పెన్షన్ జిల్లాలో చర్చానీయాంశంగా మారింది. మెదక్ ఆర్డీఓ రమాదేవి తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన సుమారు నాలుగు గంటల్లోపే సస్పెన్షన్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ కావడంపై ప్రజలు చర్చించుకుంటున్నారు. ఆర్డీఓ తనిఖీ చేసిన వెంటనే కలెక్టర్‌కు నివేదించడం.. ఆ వెంటనే వేటు వేయడం చకచకా జరిగిపోయాయి. ఇలాంటి అధికారిపై కఠినంగా వ్యవహరించిన కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు సోషల్ మీడియాలో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

మిరుప పంటలో గంజాయి సాగు


గంజాయి మొక్కలు చూపుతున్న పోలీసులు

వట్‌పల్లి(అందోల్): గుట్టచప్పుడు కాకుండా మిరుప పంటలో అంతర పంటగా సాగు చేస్తున్న గంజాయి మొక్కలను శుక్రవారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మెదక్ డివిజన్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి కథనం మేరకు.. మండల పరిధిలోని మర్వెళ్లి గ్రామానికి చెందిన జుట్టు చిన్న నర్సింలు వ్యవసాయ పొలంలో అంతర పంటగా గంజాయి సాగు చేస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు దాడులు నిర్వహించగా అక్రమంగా సాగు చేస్తున్న 20 గంజాయి మొక్కలను గుర్తించి స్వాధీనం చేసుకున్నాం. వీటి విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుంది. సదురు వ్యక్తిపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం జోగిపేట ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్ మెంట్ సీఐ పీ.వీణారెడ్డి, ఎస్ఐ ఎ.అనిల్ కుమార్, హెడ్‌కానిస్టేబుల్, విఠల్, సిబ్బంది పీ.అనిల్‌కుమార్, డీ.మల్లయ్య, ప్రహ్లాద్ రెడ్డి పాల్గొన్నారు.

అనారోగ్యంతో యువకుడి మృతి

- ఆర్‌ఎంపీ నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని మృతుడి కుటుంబీకుల దాడి

సిద్దిపేటకమాన్: అనారోగ్యంతో యువకుడు మృతి చెందాడు. ఆర్‌ఎంపీ వైద్యుడి నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని మృతుడి కుటుంబ సభ్యులు డాక్టర్‌ను చితకబాదారు. ఈ ఘటన సిద్దిపేటలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. దుబ్బాక మండలం పెద్దగుండవెల్లి గ్రామానికి చెందిన దండు పోచయ్య, విజయ దంపతులకు ఓ కూతురు, కుమారుడు ఉన్నారు. కూతురికి వివాహం కాగా, కుమారుడు రాజు(20) కూలీ పనులు చేస్తుంటాడు. కూతురు అనారోగ్యానికి గురికాగా పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఇంటి వద్ద రాజు ఒక్కడే ఉండటంతో బుధవారం మేనమామ గ్రామమైన రాఘవాపూర్‌కి వెళ్లాడు. అక్కడ జ్వరం రావడంతో ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లి చూయించారు. గురువారం సాయంత్రం పరిస్థితి విషమించిందని ఆర్‌ఎంపీ చెప్పడంతో కుటుంబ సభ్యులు వెంటనే సిద్దిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆర్‌ఎంపీ నిర్లక్ష్యంతోనే మృతిచెందాడని మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వైద్యుడిపై దాడి చేశారు. శుక్రవారం మృతుడి తండ్రి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

కండ్లలో కారం చల్లి పుస్తెలతాడు చోరీ

- నర్సాపూర్ సంతలో ఘటన

నర్సాపూర్ : కండ్లలో కారం కొట్టి మహిళ మెడలో బంగారు పుస్తెల తాడును దొంగిలించారు. ఎస్ఐ లింగం కథనం మేరకు. ప్రతీ శుక్రవారం నర్సాపూర్‌లో సంత జరుగుతుంది. ఈ క్రమంలో మంతూరుకు చెందిన లక్ష్మి కూరగాయలు కొనుగోలు చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు ఆమె కండ్లలో కారంపొడి చల్లి మెడలోని రెండు తులాల బంగారు పుస్తెల తాడును ఎత్తుకుపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డ ఘటన మండల పరిధిలోని రామునిపట్లలో శుక్రవారం చోటు చేసుకుంది.ఎస్ఐ బాలకృష్ణ కథనం మేరకు.. గ్రామానికి చెందిన దమ్మ యాదవరెడ్డి భార్య పుష్పలత ఇటీవలె అనారోగ్యంతో మృతి చెందింది. పురోహితులు కొద్ది నెలలు ఇల్లు వదిలిపెట్టమని చెప్పడంతో సిద్దిపేటలో ఉంటున్నారు. రోజు ఉదయం గ్రామానికి వస్తూ వ్యవసాయ పనులు చూసుకొని తిరిగి రాత్రి సిద్దిపేటకు వెళ్తున్నారు. శుక్రవారం ఉదయం ఇంటికొచ్చే సరికి తాళం పగులగొట్టి ఉంది. లోపలికెళ్లి చూడగా 2 తులాల బంగారం, 16 తులాల వెండి , రూ.520 నగదు కనిపించలేదు. ఇంట్లో దొంగలు పడ్డారని యాదవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బంగారం కోసమే మహిళను హత్య

- ఇద్దరు అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు
- యాదగిరిగుట్టకు వెళ్దామని బైక్‌పై తీసుకెళ్లి గొంతునులిమి చంపిన వైనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకట్‌రెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): బంగారు నగల కోసం మహిళను హత్య చేసిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఇటీవల మాసాయిపేట మండలం చెట్ల తిమ్మాయి పల్లి సాజా తండాకు చెందిన లలిత అదృశ్యమై హత్యకు గురైన విషయం తెలిసిందే. కాగా ఈ కేసు సంబంధించిన వివరాలు డీఎస్పీ శుక్రవారం వెల్లడించారు. తూప్రాన్ మండలం ఘనపూర్‌కు చెందిన ఒకే కులస్తులైన వడ్డే కనకయ్య, వడ్డే ప్రమీళకు కల్లు దుకాణంలో లలిత అనే మహిళ పరిచయమైంది. నిత్యం ఆమెతో కల్లు తాగుతుండేవారు. 11న యాదగిరిగుటట్ట దేవుడి దర్శనానికి వెళ్దామని కొత్త బట్టలు, నగలు వేసుకొని రావాలని లలితకు సూచించారు. తూప్రాన్‌కు వచ్చిన ఆమెను ఇద్దరూ బైక్‌పై యాదగిరిగుట్ట వైపునకు తీసుకెళ్లారు. జగదేవ్‌పూర్ దాటి పీర్లపల్లి అటవీ ప్రాంతంలో లలిత గొంతు నులిమి చంపేసి వెండి కడియాలు, మట్టెలు, చెవి కమ్మలు, సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లారు. నగలను తూప్రాన్‌లోనే ఓ షాపులో తాకట్టు పెట్టి బైకును కొనుగోలు చేశారు.

కూతురు ఫిర్యాదుతో..

లలిత కనిపించకపోవడంతో 14వ తేదీన కూతురు దేవి చేగుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు సాంకేతికత ఆధారంగా విచారణ చేపట్టి అనుమానితులైన వడ్డే కనకయ్య, ప్రమీళను అదుపులోకి తీసుకొని విచారించారు. నగల కోసమే హత్య చేసినట్లు నిందితులు ఒప్పుకోవడంతో ఘటనా స్థలానికి వెళ్లి లలిత మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. నిందితుల నుంచి బంగారం, నగదును స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. హత్య కేసు ఛేదనలో కృషి చేసిన రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్, చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి, సిబ్బంది సత్తయ్య, గట్టేశ్, భాస్కర్, రమేశ్, మహేశ్, హర్షద్‌లను డీఎస్పీ అభినందించారు.

వరుస దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ పట్టణంలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. శుక్రవారం రాత్రి తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. హవేళిఘణాపూర్ మండలం తొగిట గ్రామానికి చెందిన మాచబోయిన మహేశ్‌కుమార్ 3 నెలలుగా మెదక్ పట్టణంలోని ఫతేనగర్, జంబికుంట, దాయర కాలనీల్లో దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఈ మేరకు దొంగను గుర్తించి పట్టుకున్నారు. అతడి వద్ద రూ.2లక్షల నగదు, 17.5 గ్రాములు బంగారం స్వాధీనం చేసుకొని, నిందితుడిని జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.